సాక్షి
విశాఖపట్నం
గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



సంగీత అనుబంధ రంగాల్లో..

వీడియో సంబంధిత కోర్సులు అందిస్తూ ఏయూ తన ప్రత్యేకతను నిలుపుకుంటోందని సంగీత దర్శకుడు నన్నీ అన్నారు. 8లో



కేకే లైన్లో రైళ్ల గమ్యం కుదింపు

కేకే లైన్‌లో రైల్వే ట్రాక్‌పై కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో పలు రైళ్ల గమ్యాన్ని కుదించారు. 12లో



అలంకరణ.. అపురూపం

నవరాత్రి ఉత్సవాల్లో వినాయకుడిని విభిన్న రూపాల్లో తమిళనాడుకు చెందిన కళాకారులు తీర్చిదిద్దారు. 12లో

5 ఎకరాల్లో ఎక్సైజ్ కాంప్లెక్స్

రీజినల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ లేబొరేటరీ →



- ఆనందపురం మండలం గోరింటలో నిర్మాణం
- ఎక్సైజ్ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలోకి..
- నేడు భూమి పూజ చేయనున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి
- రూ.2.5 కోట్లతో ఏయూలో ఏర్పాటు చేసిన లేబొరేటరీ ప్రారంభం



ఏయూలోని రీజినల్ లేబొరేటరీలో పరీక్షలకు సిద్ధం చేసిన పరికరాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఎక్సైజ్ శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటుకానున్నాయి. ఇందుకు ఆనందపురం మండలం గోరింట కేంద్రం కానుంది. ఇక్కడ ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే ఎక్సైజ్ కాంప్లెక్స్‌లో ఆ శాఖకు సంబంధించి అన్ని కార్యాలయాలతో పాటు మద్యం డిపో కూడా ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ ఎక్సైజ్ కాంప్లెక్స్ నిర్మాణానికి గురువారం డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణ స్వామి భూమి పూజ చేయనున్నారు. అలాగే కల్తీ మద్యానికి పూర్తిగా చెక్ పెట్టేందుకు రూ.2.5 కోట్లతో ఆంధ్రా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రీజినల్ లేబొరేటరీని కూడా డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారు. రానున్న రోజుల్లో ఎక్సైజ్ కాంప్లెక్స్‌లోనే ఆ శాఖ ప్రధాన కార్యాలయం కూడా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. పరిపాలన రాజధానిగా మారుతున్న విశాఖలో క్రమంగా ఒక్కో శాఖకు సంబంధించిన ప్రధాన విభాగాలన్నీ తరలివస్తున్నాయన్న అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతోంది.

అధునాతన లేబొరేటరీ

ఆంధ్ర విశ్వ విద్యాలయం స్టాటిస్టిక్స్ విభాగం వెనుక దాదాపు రూ. 2.5 కోట్ల వ్యయంతో రీజినల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ లేబొరేటరీని ఏర్పాటు చేశారు. ఇందులో పూర్తిగా అత్యాధునిక ప్రయోగశాల, కార్యాలయం, గ్యాస్ చాంబర్, సెక్యూరిటీ గది, నిరంతరం 25 కేవీ విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాలు కల్పించారు. గ్యాస్ క్రోమాటోగ్రఫీ (జీసీ హెచ్‌ఎస్), హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమాటోగ్రఫీ(హెచ్‌పీఎల్‌సీ), అటామిక్ అబ్జార్ప్షన్ స్పెక్ట్రోస్కోపీ(ఏఏఎస్) వంటి పరికరాలను ఈ ప్రయోగశాలలో వినియోగిస్తున్నారు.

క్షుణ్ణంగా పరిశీలన

మద్యం తయారు చేసే డిస్టిలరీల్లో ఉపయోగించే పదార్థాల నుంచి వినియోగదారుడికి చేరే వరకు నిర్ణీత ప్రమాణాల మేర అన్నీ ఉండే విధంగా ఇక్కడ నిరంతర పర్యవేక్షణ జరగనుంది. అంతే కాకుండా బ్రాండ్ మిక్సింగ్‌తో పాటు మద్యంలో నీరు కలిపి విక్రయించే ఆగడాలకు కూడా ఇక అడ్డుకట్ట పడనుంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఐదు లేబొరేటరీలు ఏర్పాటు కానుండగా.. విశాఖలోని ఏయూ పరిధిలో ఏర్పాటు చేసిన ఈ లేబొరేటరీ ఉత్తరాంధ్ర జిల్లాలకు ఉపయోగకరంగా ఉంటుంది. మద్యం తయారీ పరిశ్రమల్లో బాటిలింగ్‌కు పంపే ముందు సంబంధిత శాంపిల్‌ను మొదటగా ఈ లేబొరేటరీకి పంపుతారు. దీనిని శాస్త్రీయంగా పరిశీలించి విశ్లేషించి.. బీఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నప్పుడే వాటిని అనుమతిస్తారు. ఒకవేళ పరీక్షలో నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా మద్యం లేదని తేలితే... వెంటనే తయారీ ప్రక్రియను నిలిపివేస్తారు.

అనుక్షణం పర్యవేక్షణ

ప్రస్తుతం మద్యంలో నీరు కలిపారా అనేది మాత్రమే తెలుసుకునే సాంకేతికత అందుబాటులో ఉంది. ఈ అత్యాధునిక ప్రయోగశాలలో ఏర్పాటు చేస్తున్న అధునాతన పరికరాల సహాయంతో... మద్యం తయారయ్యే డిస్టిలరీలలో ఉపయోగించే ఆల్కహాల్‌తో పాటు ఇతర పదార్థాల నాణ్యత, వాటిలో ఉండే ఇతర మలినాలను గుర్తించే అవకాశం ఉంది. అదే విధంగా బార్, రెస్టారెంట్లలో మద్యం విక్రయించే సమయంలో నీరు కలుపుతున్నారా? ఒకవేళ కలిపితే.. ఎంత శాతం కలిపారనేది కూడా సులభంగా ఇక్కడ గుర్తించే అవకాశం ఉంది. మరో వైపు తక్కువ ధర మద్యాన్ని అధిక ధర మద్యంలో కలిపి బ్రాండ్ మిక్సింగ్ చేసి.. అధిక ధరకు విక్రయించే విషయాన్ని కూడా ఈ లేబొరేటరీలో పరీక్షించి సులభంగా తేల్చవచ్చు. కల్తీ మద్యంతో పాటు మత్తు పదార్థాలకు సంబంధించిన శాస్త్రీయ పరీక్షలు ఇక్కడ జరగనున్నాయి. నార్కోటిక్ డ్రగ్స్‌ను చాక్లెట్లు ఇతర రూపాల్లో విక్రయిస్తున్నారు. వీటిని శాస్త్రీయంగా పరీక్షించి, వాటిలో వినియోగించిన డ్రగ్, పరిమాణం వంటివి గుర్తించవచ్చు.

కల్తీ మద్యానికి చెక్

ఏయూలో ఏర్పాటు చేసిన అధునాతన లేబొరేటరీని డిప్యూటీ సీఎం ప్రారంభిస్తున్నారు. ఈ లేబొరేటరీ ద్వారా కల్తీ మద్యంను తయారీ దశలోనే నిలిపివేసే అవకాశం కలగనుంది. అంతేకాకుండా బార్లు, రెస్టారెంట్లలో జరిగే బ్రాండ్ మిక్సింగ్‌ను కూడా ఇట్టే పసిగట్టవచ్చు. ఇక ఆనందపురంలో ఏర్పాటు కానున్న ఎక్సైజ్ కాంప్లెక్స్‌లోని మా శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయాలతో పాటు మద్యం డిపో కూడా ఏర్పాటు కానుంది.

– శ్రీకాంత్ రెడ్డి, ఎక్సైజ్‌శాఖ డీసీ

వచ్చేనెల 27న ఓటరు జాబితా డ్రాఫ్ట్

- ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 10 రోజులు ఆలస్యంగా ప్రచురణ
- డీఆర్వో మోహన్‌కుమార్ వెల్లడి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం: ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పుల కోసం అధికారులు ఇంటింట సర్వే పూర్తి చేశారని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి వచ్చిన సమస్యలు తెలియజేస్తే పరిశీలించి పరిష్కరిస్తున్నామన్నారు. ఈ ఏడాది జనవరి 6 నుంచి సెప్టెంబర్ 26 వరకూ ఓటర్ల జాబితాలో 1,43,468 చేర్పులు, 1,23,829 ఓట్ల తొలగింపు, 1,02,471 మంది ఓటర్ల చిరునామాలు, ఫొటోలు, ఇతర మార్పులు చేశామని వివరించారు. అక్టోబర్ 17న ప్రచురించాల్సిన ఓటరు జాబితా డ్రాఫ్ట్ ప్రచురణ 10 రోజుల ఆలస్యంగా అక్టోబర్ 27కి ఎన్నికల కమిషన్ మార్చిందని వెల్లడించారు. ప్రతి వారం ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు, మార్పుల సమాచారాన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేయడంతోపాటు బీఎల్‌వో యాప్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను డీఆర్వో నివృత్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి కృష్ణకాంత్, టీడీపీ నుంచి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ తరఫున ఎస్.సుధాకర్, ఆమ్‌ఆద్మీ తరఫున కేఎం రాజు, దాలిరాజు, సూపరింటెండెంట్ కిరణ్, మూర్తి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

శ్రీవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి వెంకటరమణ



ఆలయం వద్ద హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకట రమణ

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంటేశ్వరస్వామిని బుధవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ దర్శించుకున్నారు. శ్రీవారి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. టీటీడీ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వాదం అందజేశారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.01 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 35 రోజులకి రూ.2.01 కోట్లు వచ్చినట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హుండీల ఆదాయం లెక్కించారు. నగదుతోపాటు 136 గ్రాముల బంగారం, 15.250 కిలోల వెండి లభించినట్టు ఈవో తెలిపారు. దేవస్థానం అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏపీఈఆర్సీ విచారణ

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ వినియోగదారుల అర్జీలపై విచారణ నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) మూడు రోజుల పాటు పర్యటించనుంది. ఈ నెల 29, 30, అక్టోబర్ 1వ తేదీల్లో ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పి.వెంకట్‌రామిరెడ్డి ఆధ్వర్యంలో విచారణ నిర్వహించనున్నారు. ఇప్పటికే గృహ వినియోగదారులు, పరిశ్రమలు, వివిధ సంస్థల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై ఈ విచారణ జరగనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. ఏపీఈఆర్సీ క్యాంపు కార్యాలయం విశాఖలోని ఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన నేపథ్యంలో అక్కడి నుంచే కీలక హియరింగ్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మంత్రి కారుమూరి రాక నేడు

మహారాణిపేట: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు గురువారం విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి గురువారం తెల్లవారుజామున 5.35 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకొని బస చేస్తారు. ఉదయం 8 గంటలకు అధికారులతో సమావేశమవుతారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. 29న విశాఖలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు.

నైపుణ్యాల మెరుగుకు ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆనందపురం: బోధనా నైపుణ్యాలు మెరుగు పరచడానికే స్కూల్ కాంపెక్స్‌ల వారీగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని డీఈవో చంద్రకళ చెప్పారు. ఆనందపురం స్కూల్ కాంప్లెక్స్‌లో బుధవారం జిల్లాలోని 11 మండలాలకు చెందిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు వృత్తిపరమైన శిక్షణ అందించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన డీఈవో చంద్రకళ మాట్లాడుతూ శిక్షణలోని అంశాలను బోధనలో అన్వయిస్తే విద్యార్థులకు విషయ పరిజ్ఞానం మరింత పెరుగుతుందని చెప్పారు. నిర్దేశించిన సమయంలో పాఠ్యాంశాల బోధన పూర్తి చేయాలన్నారు. 207 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. సర్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో – ఆర్డినేటర్ శ్రీనివాస్, కోర్సు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎంఈవో గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు

అధికారులతో సమీక్షలో కలెక్టర్ మల్లికార్జున



మహారాణిపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్యాధికారులు, జీవీఎంసీ జోనల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వెబెక్స్ ద్వారా బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తారని, అందుకు సంబంధించి వలంటీర్లు ఇంటింట సర్వే వంద శాతం పూర్తి చేయాలన్నారు. పౌరులతో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్లోడ్ చేయించాలని సూచించారు. సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు వలంటీర్లు ఇంటింటికీ జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్లు తప్పనిసరిగా పంపిణీ చేయాలన్నారు. సర్వే వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వైద్యం కోసం ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వాస్పత్రులకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వైద్య సిబ్బంది, డాక్టర్లు జగనన్న సురక్ష క్యాంపుల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కంటి వెలుగు కార్యక్రమంలో గుర్తించిన వారికి శస్త్రచికిత్సలు చేయాలని, ఉపకారణాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

3న స్పోర్ట్స్ అకాడమీకి ఎంపికలు

విశాఖ స్పోర్ట్స్ : రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అకాడమీలో ప్రవేశాలకు జిల్లా స్థాయిలో ఈ నెల 3 నుంచి ఎంపికలు నిర్వహించనున్నారు. పులివెందులలోని అకాడమీలో 30 మంది బాలురకు ప్రవేశం కల్పించనున్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికలు అక్టోబర్ 10 నుంచి జరగనుండగా... బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, వాలీబాల్, హాకీ జిల్లా ఎంపికలు నిర్వహించనున్నారు. ఈ క్రీడాంశాల్లో మోటార్ ఎబిలిటీ టెస్ట్ అక్టోబర్ 3న పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్స్‌లో, స్కిల్ టెస్ట్ 4న ఏయూ గ్రౌండ్స్‌లో, 5న బుల్లయ్య కళాశాలలో ఉంటుంది. 12 నుంచి 18 ఏళ్ల వయసున్న వారు జాతీయ క్రీడా సమాఖ్య నిర్వహించిన సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో పాల్గొని తొలి 8 స్థానాల్లో నిలిస్తే ప్రాధాన్యముంటుంది. మరిన్ని వివరాలకు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోని అధికారులను 0891 2705392లో సంప్రదించవచ్చు.

పర్యాటకంలో విశాఖకు 13 అవార్డులు సొంతం



బెస్ట్ ఇన్ బౌండ్ టూర్ ఆపరేటర్ అవార్డును 5వ సారి అందుకుంటున్న ట్రావెల్ ఐక్యూ అధినేత మురళీకృష్ణ, ట్రావెల్ హోం ప్రతినిధి, ఎలిగెంట్ అధినేత పవన్ కార్తీక్

సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రతిష్టాత్మక టూరిజం అవార్డుల్లో విశాఖ జిల్లా కీలకమైన అవార్డులు సొంతం చేసుకుంది. మొత్తం 43 అవార్డుల్లో 13 అవార్డులను నగరానికి చెందిన వివిధ హోటళ్లు, రిసార్టులు, రెస్టారెంట్లు, ట్రావెల్ సంస్థలు దక్కించుకున్నాయి. విజయవాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ్, ఏపీటీడీసీ ఎండీ కన్నబాబు చేతుల మీదుగా ఆయా సంస్థల ప్రతినిధులు అవార్డులను అందుకున్నారు. బెస్ట్ 5 స్టార్ హోటల్‌గా రాడిసన్ బ్లూ అవార్డును దక్కించుకుంది. అలాగే 4 స్టార్ విభాగంలో హోటల్ దసపల్లా, బెస్ట్ బడ్జెట్ హోటల్‌గా ఎలిగెంట్ హోటల్, బెస్ట్ హరిత హోటల్‌గా అరకు హరిత వ్యాలీ రిసార్ట్, బెస్ట్ హోటల్ బెస్ట్ మీటింగ్ వెన్యూగా వరుణ్‌బీచ్ నోవోటెల్, బెస్ట్ రెస్టారెంట్ ఇన్ హోటల్‌గా గ్రీన్‌పార్క్‌లో మెకాంగ్ రెస్టారెంట్, బెస్ట్ స్టాండ్–అలోన్ రెస్టారెంట్‌గా టైకూన్ అండ్ హెరిటేజ్ రెస్టారెంట్, బెస్ట్ స్టాండ్ అలోన్ కన్వెన్షన్ సెంటర్‌గా వైజాగ్ కన్వెన్షన్స్ అవార్డులను అందుకున్నాయి. అదేవిధంగా బెస్ట్ ఇన్ బౌండ్ టూర్ ఆపరేటర్(డొమస్టిక్)గా ట్రావెల్ హోం, బెస్ట్ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్‌గా ట్రావెల్ ఐక్యూ గ్లోబల్ సొల్యూషన్స్, మోస్ట్ ఇన్నోవేటివ్ ఇన్‌బౌండ్ టూర్ ఆపరేటర్‌గా హాలిడే వరల్డ్, బెస్ట్ టూరిజం ప్రమోషన్ కొల్లాటిరల్ పబ్లిసిటీ మెటీరియల్‌గా విశాఖపట్నం పాకెట్ టూరిస్ట్ గైడ్, మోస్ట్ ఇన్నోవేటివ్ యూజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/బెస్ట్ టూరిజం వెబ్‌సైట్‌గా యో వైజాగ్ అవార్డులను సొంతం చేసుకున్నాయి.

క్రమబద్ధీకరణతో కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆనందోత్సాహాలు

మద్దిలపాలెం: కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ బిల్లును అసెంబ్లీలో బుధవారం ఆమోదించడంతో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ సమాచారం విన్న వెంటనే కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు పిఠాపురంకాలనీలోని మలేరియా సబ్ యూనిట్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీతోపాటు, ఫొటో పట్టుకుని సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఎన్నాళ్లగానో వేచి చూస్తున్న శుభతరుణం వచ్చిందంటూ కేరింతలు కొట్టారు. థ్యాంక్యూ సీఎం జగన్ సర్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరించారంటూ ఆనందం వ్యక్తం చేశారు. 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ విధానంలో జీవనం వెల్లదీస్తున్న మా జీవితాల్లో వెలుగులు నింపారంటూ సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు.

మా ఆరాధ్యదైవం సీఎం జగన్



ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరించిన సీఎం జగనన్న మాకు, మా కుటుంబాలకు ఆరాధ్య దైవంగా నిలిచారు. సరైన సమయంలో మా సర్వీసును రెగ్యులర్ చేశారు. థ్యాంక్యూ సీఎం జగన్ సార్.

–ఆర్.అప్పలాచారి, రామ్మూర్తిపంతులుపేట హెల్త్ అసిస్టెంట్

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



వయసు మీరిపోతున్న తరుణంలో సర్వీసు క్రమబద్ధీకరించి భరోసా ఇచ్చారు. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి వుంటాం. మా సేవలు గుర్తించి, మా కుటుంబాల్లో వెలుగులు నింపారు. మాట ఇస్తే తప్పని నాయకుడని నిరూపించుకున్నారు.

–కె.శ్రీను, నక్కవానిపాలెం హెల్త్ అసిస్టెంట్

జీవితాల్లో వెలుగులు నింపారు



కాంట్రాక్ట్ విధానంలో మగ్గిపోతున్న మా జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపారు. గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న డైనమిక్ లీడర్ సీఎం జగన్ సర్. ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

–వై.సింహాచలం, జబ్బర్‌తోట హెల్త్ అసిస్టెంట్

1న 'ఏక్ గంట - ఏక్ తారీఖ్' శ్రమదానం

జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ సన్యాసిరావు

అల్లిపురం: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు పరిశుభ్రత కోసం అక్టోబర్ 1న 'ఏక్ గంట – ఏక్ తారీఖ్' శ్రమదానం రుషికొండ, ఆర్కే బీచ్‌లో నిర్వహిస్తామని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు తెలిపారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజారోగ్య విభాగ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవే లక్ష్యంగా మహాత్మాగాంధీ జయంతి స్ఫూర్తితో అక్టోబర్ 1న ఒక గంటపాటు శ్రమదానం చేయనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, పాఠశాల, కాలేజీల విద్యార్థులు, ఎన్జీవోస్, నివాసిత సంక్షేమ సంఘం, స్వచ్ఛంద సంస్థలు, స్వచ్ఛభారత్ అంబాసిడర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొంటారని తెలిపారు. అదే సమయంలో నగరంలోని బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు, కళాశాలలు, తీర ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్, దేవాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో శ్రమదానం చేయాలని సూచించారు.

పర్యాటకంగా విశాఖదే భవిష్యత్

- రానున్న రోజుల్లో మరిన్ని టూరిజం ప్రాజెక్టులు
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి
- ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



వివిధ పోటీల విజేతలతో కలెక్టర్ మల్లికార్జున, టూరిజం ఆర్డీ శ్రీనివాస్ పాణి, సమాచార శాఖ జేడీ మణిరాం

సాక్షి, విశాఖపట్నం: పర్యాటక పరంగా జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి తర్వాత పర్యాటక పరంగా జిల్లా అభివృద్ధి పథంలో ముందుందని.. ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 30 వేల మందికి పైగా విదేశీ పర్యాటకులు జిల్లాలో పర్యటించారన్నారు. జిల్లాలో హోటల్ మేనేజ్‌మెంట్, రవాణా రంగాలు పర్యాటక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కొత్తగా పరిశ్రమలు, ఒబెరాయ్ వంటి హోటళ్లకు శంకుస్థాపనలు జరిగాయని.. వీటి ద్వారా టూరిజం పరంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వీఎంఆర్డీఏ పరిధిలో కైలాసగిరి పార్కును రూ.10 కోట్లతో అభివృద్ధి చేశామని.. సీహారియర్ మ్యూజియం, పార్కులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. జీవీఎంసీ పరిధిలోనూ అనేక అందాలు విశాఖకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని వివరించారు. బీచ్‌లు పరిశుభ్రంగా ఉంచేందుకు ఐదు బీచ్ క్లీనింగ్ యంత్రాలను తీసుకొచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. త్వరలోనే మరిన్ని టూరిజం ప్రాజెక్టులు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా అరకు గిరిజన థింసా నృత్యం, నృత్యభారతి నికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన వీడియోగ్రఫీ పోటీల్లో అయ్యంగారి వెంకట సందీప్, ఘంటసాల లావణ్య, కొమ్మి చంద్ర వెంకటలక్ష్మి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి కలెక్టర్ జ్ఞాపికలు, ధ్రువీకరణపత్రాలు అందించారు. వ్యాసరచన, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టూరిజం శాఖ రీజినల్ డైరెక్టర్, ఈడీ శ్రీనివాస్‌పాణి, సమాచార శాఖ రీజినల్ జేడీ వి.మణిరామ్, గాదిరాజు ప్యాలెస్ జీఎం భరత్ వర్మ, సన్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న బాలికల నాట్య ప్రదర్శన



అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సచివాలయాల్లోనే 'విద్యుత్' సేవలు

డొండపర్తి: గ్రామ, వార్డు సచివాలయాల సేవలు మరింత విస్తృతమవుతున్నాయి. ప్రజలకు అన్ని విభాగాల సేవలు సచివాలయాల ద్వారా అందించే ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఇప్పటి వరకు సంక్షేమ పథకాలతోపాటు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తున్న సచివాలయాల్లో తాజాగా ఏపీఈపీడీసీఎల్‌కు సంబంధించిన సేవలు కూడా అందనున్నాయి. విశాఖ సర్కిల్‌లో విద్యుత్ వినియోగదారులు ఇకపై మీ – సేవ కేంద్రాలకు బదులుగా సమీపంలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈపీడీసీఎల్ సేవలు పొందే వెసులుబాటును అందుబాటులోకి తీసుకొచ్చారు. గృహ, వాణిజ్య సర్వీస్ కనెక్షన్‌కు దరఖాస్తు, వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు, అదనపు లోడ్, కేటగిరీ మార్పు, సర్వీస్ కనెక్షన్ పేరు మార్పు, మీటర్ టెస్టింగ్‌కు సంబంధించి, మీటర్ ఆగిపోయినా లేక నెమ్మదిగా తిరుగుతున్నా, మీటరు కాలిపోయినా, బిల్లులకు సంబంధించిన సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ సంబంధించిన ఫిర్యాదులు, ఓల్టేజ్ హెచ్చుతగ్గులు, లైన్ షిఫ్టింగ్, పోల్ షిఫ్టింగ్‌కు సచివాలయాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. ఇప్పటి వరకు విద్యుత్ వినియోగదారులు మీ – సేవా కేంద్రాల ద్వారా పొందుతున్న ఈ సేవలను ఇకపై సచివాలయాల ద్వారా మరింత త్వరగా పొందవచ్చని వెల్లడించారు.

ఎంఎస్ఎంఈల ఫైనాన్సింగ్‌కు ప్రత్యేక చర్యలు

మద్దిలపాలెం: చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని ఆర్‌బీఐ ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంట్ సిస్టం ద్వారా అందిస్తుందని ఎంఎస్ఎంఈ ఫౌండర్, సలహాదారుడు డాక్టర్ రాజేంద్ర సిన్హా తెలిపారు. ఎంఎస్ఎంఈ ఫైనాన్సింగ్ సిస్టంపై బుధవారం ఓ హోటల్‌లో సీఐఐ(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ డాక్టర్ పీపీ లాల్‌కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాజేంద్రసిన్హా మాట్లాడారు. ఆర్థికపరమైన లోటును తీర్చడానికి విశాఖపట్నంలోని ఎంఎస్ఎంఈలకు తమ వంతు సహకారం అందించడానికి బ్యాంకులతో సమావేశమైనట్టు చెప్పారు. అర్హులకు త్వరితగతిన బ్యాంకు రుణాలు అందించాలన్నారు. ట్రాన్స్ యూనియన్ సిబిల్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ రవీంద్ర సలూజా మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు సిబిల్ ప్రాముఖ్యత తెలిపారు. సకాలంలో రుణాలు పొందడానికి సిబిల్ స్కోర్ అత్యవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐఐ ఎంఎస్ఎంఈ ప్యానెల్ కన్వీనరు కృష్ణబాలాజీ, కో - కన్వీనర్ పి.శ్రీనివాసరావు, ఎస్‌బీఐ విశాఖ సర్కిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్, జి.శ్రీనివాసశర్మ, తదితరులు పాల్గొన్నారు.

సంగీత అనుబంధ రంగాల్లో ఉపాధి

- సంగీత దర్శకుడు, సౌండ్ ఇంజినీర్, గాయకుడు సన్నీ ఎం.ఆర్
- ఏయూలో ఆడియో ల్యాబ్, వీడియో ఎడిటింగ్ స్టూడియో, కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం


ల్యాబ్ పనితీరును పరిశీలిస్తున్న రిజిస్ట్రార్, రెక్టార్‌లు

ఏయూ క్యాంపస్: ఆడియో, వీడియో సంబంధిత కోర్సులు అందిస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయం తన ప్రత్యేకతను నిలుపుకుంటోందని ప్రముఖ సంగీత దర్శకుడు, సౌండ్ ఇంజినీర్, గాయకుడు సన్నీ ఎం.ఆర్ అన్నారు. బుధవారం ఉదయం ఏయూలోని ఏయూ - సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్ మ్యూజిక్ ప్రొడక్షన్ కేంద్రం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆడియో ల్యాబ్, వీడియో ఎడిటింగ్ స్టూడియో, కంప్యూటర్ ల్యాబ్‌ను ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సన్నీ మాట్లాడుతూ సంగీతానికి సంబంధించిన అనుబంధ రంగాలు ఎంతగానో అభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. ఈ రంగంలో రాణించాలనుకునే యువతకు ఆంధ్ర విశ్వవిద్యాలయం - సెయింట్ లూక్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అధునాతన రికార్డింగ్ స్టూడియో, ల్యాబ్‌లో అందించే శిక్షణ ఎంతో ఉపయోగంగా నిలుస్తుందన్నారు. మీడియా, చలనచిత్ర రంగాలు ఎంతగానో అభివృద్ధి చెందడంతో యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతమవుతున్నాయని చెప్పారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోరుకున్న విధంగా ప్రతి విద్యార్థికి పూర్తి స్వేచ్ఛ అందిస్తూ నచ్చిన రంగంలో రాణించి, సమగ్ర వికాసానికి ఉపయుక్తంగా ఏయూ పనిచేస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా వీడియో ఎడిటింగ్, సౌండ్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన కోర్సులు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆధునిక లేబొరేటరీ, స్టూడియో ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రత్యక్షంగా శిక్షణ అందిస్తూ ఈ రంగంలో వారిని నిపుణులుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటుచేసిన కంప్యూటర్ ల్యాబ్, ఆడియో లేబొరేటరీ, వీడియో ఎడిటింగ్ స్టూడియోలు పూర్తిస్థాయిలో విద్యార్థులకు ఉపకరిస్తాయన్నారు. సంగీత దర్శకులు ఏయూ - సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ కేంద్రం నిర్వాహకులు ఆశీర్వాద్ లూక్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించిన సహకారంతో ప్రపంచస్థాయి రికార్డింగ్, ఎడిటింగ్ స్టూడియో సదుపాయాలు ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఇటువంటి వసతులు కల్పించడం ఎంతో గర్వకారణమని చెప్పారు. అనంతరం విశ్వవిద్యాలయం తరఫున సంగీత దర్శకుడు, సౌండ్ ఇంజినీర్, గాయకుడు సన్నీ ఎం.ఆర్‌ని సత్కరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ చెయిర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రవేశాల సంచాలకులు డి.ఎ.నాయుడు, ఆచార్య టి.శోభ శ్రీ,, ఏయూ సంగీత విభాగాధిపతి ఆచార్య ఎ.అనురాధ, ఆచార్య సరస్వతి పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలు భేష్


ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి వద్ద కేంద్ర, రాష్ట్ర వైద్యుల బృందం

మహారాణిపేట: హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని కేంద్ర వైద్య బృందం సభ్యులు తెలిపారు. బుధవారం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ విభాగం అడిషనల్ సెక్రటరీ ఎకలి జిమ్మోమి పలు ఆస్పత్రులను సందర్శించారు. ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి, సేఫ్ కేర్ సెంటర్, కేజీహెచ్, ఆంధ్రా మెడికల్ కాలేజీలో రిఫరెన్స్ లేబొరేటరీలు, వైరల్ లోడ్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కేంద్రాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు మంచి సేవలు అందుతున్నాయన్నారు. ఐసీటీసీ కేంద్రంలో కౌన్సెలింగ్, వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ విభాగం పీడీలు డాక్టర్ చిన్నయిదాస్, డాక్టర్ రాజేంద్రకుమార్, అడిషనల్ పీడీ కోటీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాయల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి

సీతమ్మధార : రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. సీతమ్మధార ఎన్ఆర్ఐ ఆస్పత్రి ఎదురుగా గల కేవీఆర్ ఎస్టేట్ భవనంలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సిబ్బంది, కుటుంబ సభ్యుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. కేవీఆర్ సోదరుడు, కేవీఆర్ ఎస్టేట్ మేనేజింగ్ పార్టనర్ కాయల సూరారెడ్డి, విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, వీకేపీపీఐఆర్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, వార్డు ఇన్‌చార్జి కర్రి మురళీకృష్ణారెడ్డితో పాటు పలువురు నాయకులు కాయల వెంకటరెడ్డిని గజామాలలతో సత్కరించారు. తన కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. తాను ప్రజల మనిషినని, జగనన్న మనిషినని, అభిమానులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

మూడు రోజులుగా పోలీస్ స్టేషన్‌లోనే బాలుడు

ఇంటికి పంపించకుండా విచారిస్తున్న భీమిలి క్రైమ్ పోలీసులు

తగరపువలస: భీమిలి క్రైమ్ పోలీసులు జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతపేటకు చెందిన 16 ఏళ్ల బాలుడిని మూడు రోజులుగా అదుపులోకి తీసుకుని తమ కళ్ల ముందే హింసిస్తున్నట్టు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సంగివలస, తగరపువలస పరిధిలో జరిగిన దొంగతనాలకు సంబంధించి అనుమానితునిగా సోమవారం రాత్రి ఇంటి నుంచి ఆ బాలుడిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. రెండు వేర్వేరు దొంగతనాలకు సంబంధించి 8 తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు, ఖరీదైన చెప్పులు చోరీ అయినట్టు గుర్తించిన పోలీసులు అనుమానితునిగా తీసుకెళ్లినట్టు తెలిసింది. చట్ట ప్రకారం మైనర్లను రాత్రి వేళ ఇంటికి పంపించి పగటి వేళ విచారించడమో... లేదా జువైనల్ హోమ్‌లో విచారించాలి. అందుకు భిన్నంగా మూడు రోజులుగా స్టేషన్‌లోనే ఉంచి విచారిస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులే రెండు రోజులుగా టిఫిన్, భోజనం తీసుకెళ్లి స్టేషన్‌లో అందిస్తున్నారు. ఈ విచారణలో భాగంగా బంగారు ఆభరణాలు చోరీ చేసినట్టు ఒప్పుకోవాలని చిత్రహింసలు పెట్టినట్టు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అందులో భాగంగా శరీరంపై దెబ్బలు మాన్పేందుకు ఆస్పత్రికి కూడా పోలీసులు తీసుకెళ్లినట్టు తెలిసింది. అంతేకాకుండా పోలీసులు బాలుడి ఇంటికి వెళ్లి సోదా చేయగా ఏమీ దొరక్కపోవడంతో పక్కింట్లో మేనమామ కుటుంబం నుంచి బలవంతంగా మూడున్నర తులాల ఆభరణాలు రికవరీ పేరుతో స్వాధీనం చేసుకున్నారు. ఇంకా నాలుగున్నర తులాల ఆభరణాలు ఇస్తే తప్ప బాలుడిని విడిచిపెట్టబోమని తల్లిదండ్రులను బెదిరిస్తున్నారు. లేదంటే ఎవరి పేర్లయినా చెప్పాలని బాలుడిని వేధిస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. ఎవరో చేసిన దొంగతనాన్ని బలవంతంగా తమ కుమారునిపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా తల్లిదండ్రులకు నోటీసు ఇవ్వకుండా మైనర్‌ను మూడురోజులు ఇంటికి పంపించకుండా విచారించడం, హింసించడం చట్ట విరుద్ధమని భీమిలికి చెందిన ప్రముఖ న్యాయవాది తెలిపారు.

క్రైస్తవులకు చంద్రబాబు చేసిందేమీ లేదు

- క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ


మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సీతంపేట: గత టీడీపీ ప్రభుత్వంలో క్రైస్తవులకు చంద్రబాబు నాయుడు చేసిందేమీ లేదని, నాలుగేన్నరేళ్లపాటు మైనార్టీ శాఖకు మంత్రినే నియమించలేదని ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా తెలుగుదేశం క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటి స్వామిదాస్ కర్నూలులో చేసిన వ్యాఖ్యలను జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. లలితానగర్‌లోని కార్యాలయంలో బుధవారం వెస్లీ విలేకరులతో మాట్లాడారు. 2019 ఎన్నికలకు మూడు నెలల ముందు డైరెక్టర్లతో బోర్డును నియమించకుండా ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను మాత్రమే నియమించి చేతులు దులుపుకున్న అసమర్థ ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక మైనార్టీకి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వెంటనే క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్లను నియమించి క్రైస్తవులకు, మైనార్టీలకు న్యాయం చేశారని కొనియాడారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో క్రైస్తవుల సంక్షేమానికి రూ.150 కోట్లు కూడా ఖర్చు చేయలేదని, జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో రూ.400 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. ప్రభుత్వ సబ్సిడీతో ఇప్పటికే ఎన్నో బృందాలు జెరూసలేం వెళ్లాయని తెలిపారు. క్రైస్తవుల సంక్షేమానికి సీఎం జగన్ చేసినంత మేలు ఎవరూ చేయలేదన్నారు. అలాంటి ముఖ్యమంత్రిని కొంతమంది క్రైస్తవ నాయకులు ఉద్దేశపూర్వకంగా విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడికి మైనార్టీలన్నా, ఎస్సీలన్నా, క్రైస్తవులన్నా ఇష్టం ఉండదన్నారు. టీడీపీ క్రైస్తవ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని క్రైస్తవులు నమ్మే స్థితిలో లేరన్నారు. రాబోయే ఎన్నికల్లో క్రైస్తవులంతా జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలుస్తారని పేర్కొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

- కలెక్టర్‌కు వీఏడబ్ల్యూజేహెచ్ సొసైటీ వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఏడబ్ల్యూజేహెచ్ సొసైటీ ప్రతినిధులు

సీతమ్మధార: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని విశాఖ అక్రిడిటేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్(వీఏడబ్ల్యూజేహెచ్) సొసైటీ గౌరవ అధ్యక్షుడు కె.జి.రాఘవేంద్రరెడ్డి, అధ్యక్షుడు బి.రవికాంత్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ మల్లికార్జునను బుధవారం సొసైటీ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ 2006 నుంచి 2023 వరకు అక్రిడిటేషన్ కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలివ్వాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. ఇప్పటికే తామంతా ఒక సొసైటీగా ఏర్పాటయ్యామని.. 18 ఏళ్లుగా విశాఖలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించలేదన్నారు. సుదీర్ఘ కాలంగా ఇళ్ల స్థలాల కోసం వేచి చూస్తున్నామని.. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సొసైటీ ప్రతినిధుల వినతిపై కలెక్టర్ మల్లికార్జున సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గతంలో స్థలాల కేటాయింపు ఏ విధంగా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. సొసైటీ సలహాదారుడు పి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మురళీకృష్ణారెడ్డి, కె.పరశురాం, సహాయ కార్యదర్శులు ఎస్.అనురాధ, ఎం.చిట్టిబాబు, బందరు శివప్రసాద్, పి.శ్రీనివాసరావు, యు.వి.భాస్కరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.ఎ.రావు, బొప్పన రమేష్, కోశాధికారి ఆలపాటి శరత్‌కుమార్, సీనియర్ జర్నలిస్ట్ ఆర్.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.